క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: తాడితోట ఫీడర్ వార్షిక మరమ్మత్తుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ సక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొత్తపేట, శ్యామల సెంటర్, టి.నగర్, ఇన్నీస్‌పేట, సాయికృష్ణ సెంటర్, స్టేడియం రోడ్డు, ఆదర్శ్ నగర్, రామకృష్ణ నగర్, తాడితోట, గాం.దీపురం, రైల్వేస్టేషన్, ఆల్కాట్ గార్డెన్స్, బాలాజీ పేట, ఐదుబళ్ల మార్కెట్, శంభూనగర్, ఐఎల్‌టీడీ సెంటర్, ఆవరోడ్డు ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

సీఎం జగన్ నిర్ణయంపై హర్షం

రాజమహేంద్రవరం రూరల్: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు ముద్దాల తిరుపతిరావు (అను) హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు కాంట్రాక్ట్ ఉద్యోగులను ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు.

పార్కు పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోని ఏకేసీ కాలేజీ వద్ద గల పరమహంస యోగానంద మార్గ్‌లోని పార్కును ప్రజావినియోగంలోకి తీసుకురావాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆ పార్కును ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. సందర్శకులకు చేయాల్సిన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడరాదని ఆదేశించారు.

ఏపీఎన్జీవో మహాసభలకు అనుమతి ఇవ్వాలి



కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీఎన్జీవో ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీఎన్జీవో 21వ రాష్ట్ర మహాసభలకు ప్రభుత్వం ప్రత్యేక సెలవు మంజూరు చేసినందున జిల్లాలోని ఉద్యోగులకు అనుమతి ఇవ్వాలని నగర ఏపీఎన్జీవో సంఘం బుధవారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతకు విజ్ఞప్తి చేసింది. స్థానిక కలెక్టరేట్‌లో ఆమెను ఏపీఎన్జీవో సంఘం ప్రతినిధులు కలిశారు. వారిలో రాజమహేంద్రవరం యూనిట్ నగర అధ్యక్షుడు వైవీపీఎస్ నాయుడు, కార్యదర్శి సేవా ప్రవీణ్ కుమార్, సహాధ్యక్షుడు పి.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్‌వీఎస్ ప్రతాప్, మహ్మద్ దురానీ, సహ కార్యదర్శి జి.రాజశేఖర్, సభ్యుడు కె.ఆనంద్ ఉన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత



దివ్యాంగురాలికి వీల్ చైర్ అందిస్తున్న రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: నారాయణపురం ఐదో వీధికి చెందిన ఎస్.సరస్వతి అనే దివ్యాంగురాలికి బుధవారం స్వర్ణాంధ్ర సేవాసంస్థ వీల్‌చైర్ వితరణ చేసింది. ఇటీవల మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి బహూకరించిన వీల్‌చైర్‌ను స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు.. సత్యవతికి ఇంటికి వెళ్లి అందజేశారు. సత్యవతి మూడేళ్ల వయసులో పోలియో వచ్చి మంచానికే పరిమితమైంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎంఏ వరకూ చదివించారు. అయితే ఆమె నడవలేని స్థితిలో ఉండడంతో కుటుంబ సభ్యులపై ఆధారపడి జీవిస్తోంది. ఆమె పాత వీల్‌చైర్ పాడైపోవడంతో స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబును సంప్రదించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, శ్రీనివాస్, స్వర్ణాంధ్ర మేనేజర్ కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లైన్ల విస్తరణ పనులను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సంబంధిత అధికారులకు సూచించారు. ముగ్గళ్ల, రఘుదేవపురం మధ్యలో జరుగుతున్న కాంక్రీట్ లేయర్ల పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులను ఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిరంతరం సంబంధిత రోడ్లు భవనాలశాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో పనుల పురోగతిపై సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యం





మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బోస్, చిత్రంలో చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు, మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

- పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బోస్
- సచివాలయ కన్వీనర్లతో సమావేశం

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్ రామ్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు.

కలిసికట్టుగా సాగుదాం

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ గత ఎన్నికలలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రతి కార్యకర్త ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. రానున్న ఎన్నికలలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని, రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే మన ప్రధాన లక్ష్యమన్నారు. అందరం ఒకేమాట, ఒకే అడుగుగా చేయిచేయి కలిపి పార్టీ అభ్యర్థి చందన నాగేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

సైనికుల్లా పనిచేయాలి: ఎంపీ భరత్ రామ్

రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని, అందుకు కార్యకర్తలందరూ సుశిక్షితులైన సైనికులుగా పని చేయాలని ఎంపీ భరత్ రామ్ అన్నారు. ప్రతి కన్వీనర్ జేసీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ పరిధిలోని గృహసారథులందరినీ చేర్చుకోవాలన్నారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలు ఎంతో సమర్థంగా పనిచేస్తూ ప్రజాభిమానాన్ని పొందుతున్నాయన్నారు.

అండగా ఉంటా : చందన నాగేశ్వర్

కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని ప్రజలలోకి తీసుకువెళ్లాలని, విపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. సమావేశంలో రూరల్ నియోజకవర్గ పరిశీలకులు పేరి కామేశ్వరరావు (పీకే రావు), పార్టీ రాష్ట్రకార్యదర్శి మింది నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, తాడాల విష్ణుచక్రవర్తి, కొప్పినీడి రాజమౌళి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బిల్డర్ చిన్న పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లకు బీమా భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

- సీఎం జగన్ ఆదేశాలతో అవకాశం
- ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ కన్వీనర్ల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోబోతున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. బుధవారం నగరంలోని సిటీ కో ఆర్డినేటర్ కార్యాలయంలో కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం జేసీఎస్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు సచివాలయ కన్వీనర్లకు జీవిత బీమా చేయనున్నట్లు తెలిపారు. క్లస్టర్ల పరిధిలో కన్వీనర్లందరూ గురువారం ఉదయం 11 గంటలకు వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత జేసీఎస్‌లదేనన్నారు. కన్వీనర్లు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, నామినీ వివరాలతో రావాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళ అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, జేసీఎస్‌లు బర్రే కొండబాబు, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక పాల్గొన్నారు.

చంద్రబాబుది ఉత్తుత్తి బండ

సీటీఆర్ఐ: చంద్రబాబు రచ్చబండ కాదు, ఉత్తుత్తి బండ అని పేరు పెట్టుకుంటే సరిగ్గా సరిపోతుందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ వ్యాఖ్యానించారు. బుధవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు రాజమండ్రి రూరల్‌లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని పాత్రికేయులు ఎంపీ భరత్ దృష్టికి తీసుకురాగా ఆయన పైవిధంగా స్పందించారు. రచ్చబండ అనగానే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ గుర్తుకు వస్తారని, అటువంటి రచ్చబండ పేరును చంద్రబాబు కాపీ కొట్టడమేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు రాష్ట్రంలో రైతులను నట్టేట ముంచారని, రైతు రుణమాఫీ చేస్తానని మొండి చేయి చూపారన్నారు. వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించినప్పుడు.. చంద్రబాబు ఆ హామీని ఎగతాళి చేశారన్నారు. మామనే వెన్నుపోటు పొడిచిన ఆయనను ఈ రాష్ట్ర ప్రజలు నమ్మబోరన్నారు. ఎన్నికల వేళ ఇప్పుడొచ్చి ఓట్ల కోసం ఆయన చెబుతున్న మాయమాటలను నమ్మడానికి ప్రజలేమీ అమాయకులు కారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా తనిఖీ



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఓటర్ల జాబితా తనిఖీని పారదర్శకంగా నిర్వహించాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన సమీక్షించారు. క్షేత్రస్థాయిలో చేయాల్సిన పరిశీలనపై సూచనలు చేశారు. బూత్ లెవెల్ ఆఫీసర్లతో రాజకీయ పార్టీలు సంబంధిత బూత్‌కు కేటాయించిన వారిని మాత్రమే పరిశీలనకు అనుమతించాలన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న తనిఖీని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపుల వివరాలు అందజేస్తామని, వాటిని పరిశీలించుకోవాలని అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, అర్బన్ తహసీల్దార్ సుస్వాగతం, డిప్యూటీ తహసీల్దార్లు పవన్, దుర్గా మల్లేశ్వరి పాల్గొన్నారు.

నగరంలో ఉత్సాహంగా గడప గడపకూ



ప్రజలతో మాట్లాడుతున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకునేందుకు మీ వద్దకు వచ్చానని లబ్ధిదారులతో వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక 49వ డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ వైఎస్సార్ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడుతూ స్థానికంగా సమస్యలు ఉంటే తెలియజేస్తే తక్షణమే పరిష్కరిస్తానన్నారు. సుబ్బారావు నగర్ హైస్కూల్ వద్ద ఆకతాయిలు ఇబ్బంది కలిగిస్తున్నారని స్థానికులు తెలపడంతో, ఆయన సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి సమస్య లేకుండా చూడాలని కోరారు. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయ్యేలా ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పరిశ్రమల అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కానుబోయిన సాగర్, నాయకులు గారా చంటిబాబు, తిరగడ దుర్గ పాల్గొన్నారు.

సమగ్ర పోషక యాజమాన్యంతో దిగుబడులు



శాస్త్రవేత్త చంద్రశేఖరరావును సత్కరిస్తున్న శ్యామ్‌రాజ్ నాయక్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వరి పంటలో అధిక, సుస్థిర దిగుబడులు సాధించాలంటే సమగ్ర పోషక యాజమాన్యం చేపట్టి, సమతుల్యంగా పోషక పదార్థాలు వాడాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్యామ్‌రాజ్ నాయక్ అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలలో సమగ్ర ఎరువులు -పోషకాలు యాజమాన్యం అంశంపై విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. శ్యామ్‌రాజ్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వ విద్యాలయం 60 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా కళాశాల విద్యార్థులకు సదస్సుల ద్వారా వ్యవసాయంలో పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రఖ్యాత భూసార శాస్త్రవేత్త డాక్టర్ పి.చంద్రశేఖరరావు మాట్లాడుతూ సమగ్ర పోషకాలు – యజమాన్య పద్ధతులపై పలు సూచనలు అందజేశారు. భూసార శాస్త్ర విభాగం ప్రధాన అధిపతి డా.విజయ్ శంకర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు





విద్యార్థుల ప్రదర్శనలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాలులో కేంద్ర సాహిత్య అకాడమీ, నన్నయ వర్సిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు వక్తల ప్రసంగాలతో సాగిన కార్యక్రమం సాయంత్రం విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తిపోయింది. మహాభారతంలోని వివిధ ఘట్టాలతో కూడిన ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. కేరింతలు, చప్పట్ల ధ్వనులతో కన్వెన్షన్ హాలు మారుమ్రోగింది.

దాతల సహకారం ఎనలేనిది

పెదపూడి: విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదని సంపర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాకూర్తి త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఆ పాఠశాలలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు యెరుబండి శ్రీరామచంద్రమూర్తి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సలాది విమల, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా రామయ్యన్న, ఇతర ప్రజాప్రతినిధులు తిబిరిశెట్టి ఆదినారాయణ, అద్దంకి బాబులు, అద్దంకి భద్రం, వీరబాబు, నాగిరెడ్డి భాస్కరరావు, అద్దంకి శ్రీరామచంద్రమూర్తి, సంపర అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సంపర అసోసియేషన్ సౌజన్యంతో మల్లిపూడి రామకృష్ణ రూ.25 వేల మైక్ సెట్, నాగిరెడ్డి భాస్కరరావు రూ.20 వేల ప్రింటర్, ఎస్‌ఈఏ సంస్థ వారిచే 40 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు, తెమ్మనబోయిన వీర్రాజు, మల్లిపూడి శ్రీనివాసరావు రూ.50 వేల విలువైన మొక్కలు, అద్దంకి దొరబాబు విద్యార్థులకు తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు రూ.36 వేలు, అద్దంకి శ్రీరామచంద్రమూర్తి ఆయన కుమారుడు వెంకటరామారావు విద్యార్థులకు రూ.20 వేల విలువైన నగదు ప్రోత్సాహకాలు అందించారు.

ఆటాడుకుందాం రండి..

- కడియం పోలీసుల ఆహ్వానం
- ఆసక్తి కలవారి వివరాల నమోదు
- ఇండోర్ షటిల్ కోర్టులో ఏర్పాట్లు పూర్తి



కడియం పోలీస్ స్టేషన్ వద్ద షటిల్ కోర్టులో ఆడుతున్న క్రీడాకారులు

కడియం: ఆటాడుకుందాం రండి అంటూ కడియం పోలీసులు ఆహ్వానం పలుకుతున్నారు. అసలే పోలీసులు, ఆడుకుందాం అంటున్నారేంటని అపోహపడొద్దు. ఇది కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలతో సత్సంబంధాలను మరింతగా మెరుగుపర్చుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ క్రీడా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను గుర్తించారు. సరిపడినంత స్థలం ఉన్న చోట్ల వివిధ క్రీడాంశాలకు సంబంధించిన కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. వాలీబాల్, టెన్నిస్, షటిల్, బాస్కెట్‌బాల్ తదితర కోర్టులను ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలను పలు పోలీస్ స్టేషన్ల వద్ద ఇప్పటికే గుర్తించారు.

కడియంలో షటిల్ కోర్టు

అందులో భాగంగా కడియం పోలీస్‌స్టేషన్ వద్ద ఇండోర్ షటిల్ కోర్టును సిద్ధం చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా క్రీడా కార్యక్రమాలు నిర్వహించడానికి ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి విస్తృత ప్రోత్సాహం అందించారు. ఈ నేపథ్యంలో కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ కూడా ఎస్పీ ఆదేశాల మేరకు ఇండోర్ కోర్టును సిద్ధం చేశారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని ధవళేశ్వరం, బొమ్మూరు స్టేషన్లలో కూడా ఇదే రీతిలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అన్ని వసతులు

అత్యున్నతస్థాయి క్రీడా ప్రమాణాలకు అనుగుణంగా కడియంలో షటిల్ కోర్టును నిర్మించారు. సాధారణంగా క్రీడాకారుల ఆటను గాలి వేగం ప్రభావితం చేస్తుంది. దీంతో ఓపెన్ ప్లేస్‌లో ఆడే సమయంలో తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారు. పాయింట్ల స్కోరింగ్‌లో కూడా తడబడతారు. ఈ ఇబ్బందులేవీ రాకుండా కోర్టు చుట్టూ సుమారు 30 అడుగులకంటే ఎత్తయిన ఐరన్ పోల్స్ ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ గ్రీన్ కలర్ షేడ్‌నెట్‌ను పెట్టారు. దీంతో కోర్టు లోపలికి వేగంగా గాలి రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. రాత్రిపూట కూడా ఆడేందుకు వీలుగా లైట్లు ఏర్పాటు చేశారు.

20 మందికి పైగా నమోదు

ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా షటిల్‌కోర్టును ఈనెల 8న ప్రారంభించారు. కోర్టు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఆసక్తి గల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ కోరారు. దీంతో ఇప్పటి వరకు 20 మందికి పైగా షటిల్ ప్లేయర్లు పోలీస్ స్టేషన్ వద్దనున్న కోర్టును వినియోగించుకునేందుకు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు కూడా ఈ కోర్టును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఇన్‌స్పెక్టర్ తిలక్ కోరుతున్నారు.

కులవృత్తులకు ప్రాధాన్యం

సీతానగరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని కులవృత్తులకూ ప్రాధాన్యం లభిస్తోందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సీతానగరంలోని బ్రహ్మంస్వామి వారి ఆలయ ఆవరణలో బుధవారం మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బలగం వీరభద్రం ఆధ్వర్యంలో విశ్వబ్రహ్మణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు అందుతున్నాయన్నారు. కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు, చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: దేశ రాజకీయాల్లో అజాత శత్రువుగా, అందరి ప్రశంసలు పొందిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపి జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. బొమ్ముల దత్తు మాట్లాడుతూ ప్రధానిగా దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, జాతీయ రహదారుల నిర్మాణం, అణు పరీక్షల నిర్వహణ, కార్గిల్ విజయం వంటి వాటితో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారన్నారు. కార్యక్రమంలో యెనుమల రంగబాబు, బూరా రామచంద్రరావు, పాట్లూరి రామ్మోహనరావు, కాలెపు సత్యసాయిరామ్, అడబాల రామకృష్ణ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: అంబేడ్కర్ ఆవాస యోజన పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన మహోన్నతుడు మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ ఓబీసీ జోనల్ ఇన్‌చార్జి కురగంటి సతీష్ కొనియాడారు. శాటిలైట్‌సిటీ బీబ్లాకులో రూరల్ కోకన్వీనర్ యానాపు ఏసు ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. కరుటూరి శ్రీనివాసరావు, ధనాల రామలక్ష్మి, పట్నాల నాగార్జున, సిద్ధాని వెంకట్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి

సీటీఆర్ఐ: స్వాతంత్ర్యోద్యమంలో తనదైన పాత్ర పోషించి, పేదల అభ్యున్నతికి కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. బుధవారం స్థానిక వై.జంక్షన్ వద్ద గౌతు లచ్చన్న జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పేదల కోసం పోరాడిన వ్యక్తి లచ్చన్న అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాలెపు సత్యసాయిరామ్ పాల్గొన్నారు.

భోజనం ప్లేట్ల వితరణ

మధురపూడి: గాడాలలోని హైస్కూల్ విద్యార్థులకు బుధవారం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరంలో విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న టి.శిరీష వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మలాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు చాటపర్తి దుర్గారావు, మడికి గంగాధర్, పైడిమల్ల ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.